క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం దేవస్థానం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం నిర్వహించగా.. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా



డ్రా తీసి మహిళా రైతుకు టోకెన్ అందిస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులో సోమవారం రైతుల స్టాళ్లకు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు డ్రా తీసి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతీ వారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపారులు వారికి కేటాయించిన స్టాళ్లలోనే కూరగాయలు విక్రయించాలని స్పష్టం చేశారు. ఉదయం, సాయంత్రం వ్యాపారం చేసుకునే వారందరికీ డ్రా తీసి స్టాళ్లు కేటాయించామని తెలిపారు. స్టాళ్లు ఉన్న వారు కూరగాయలు నేల మీద వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రాజశ్యామల హోమం



శ్రీలలితాపీఠంలో రాజశ్యామల హోమంలో భక్తులు, వేదపండితులు

సీతంపేట : శ్రీలలితా పీఠంలో రాజశ్యామల నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం పీఠంలో రాజశ్యామల హోమం ఘనంగా నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తకంగా హోమం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని హోమం చేయించుకున్నారు. ముందుగా మణిద్వీపంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, సహస్రనామార్చన, అలంకరణ చేశారు. శుక్రవారంతో నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఈ నెల 9 నుంచి 12 వరకు శ్రీలలితాపీఠం 76వ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని, ఇందులో భాగంగా 10న సాయంత్రం లలితా కామేశ్వరుల కల్యాణం జరిపిస్తామని తెలిపారు.


అలరించిన కవి సమ్మేళనం



కవితాగానం చేస్తున్న చిన సూర్యనారాయణ

సీతంపేట : సహృదయసాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కవి సమ్మేళనం వైవిధ్యభరితమైన కవితలతో అందరినీ అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వానికి వస్తువు, అభివ్యక్తి రెండూ ముఖ్యమని, అలంకారం కావ్య సౌందర్యానికి శోభనిస్తుందన్నారు. భావాన్ని స్పష్టంగా, చమత్కారంగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కె.జి.వేణు మాట్లాడుతూ కవిత్వం నిత్య నూతనంగా ఉండాలని, కవి సమాజ శ్రేయోభిలాషి అన్నారు. ఈ సందర్భంగా నటుడు, నాటకకర్త రావి కొండలరావు సాహిత్య విశేషాలను వివరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు కవిత్వంలోని విశేషాలు, ప్రముఖ కవుల రచనలు విశ్లేషించారు. అనంతరం రచయితలు చినసూర్యనారాయణ, కుమార్‌రావు, పరమేశ్వరరావు, వి.ఆర్.రావు, కె.వి.రామారావు, జగదీశ్వరరావు కవితలు చదివి వినిపించారు.

మాఘ మాధవ మాసం



ఆలయ ప్రాంగణంలోని పవిత్ర జలధార





ఆలయంలో శ్రీ లీలామాధవస్వామి, అమ్మవార్లు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

- మాధవస్వామి ఆలయానికి భక్తుల తాకిడి
- అన్నసమారాధనలు, తీర్థ మహోత్సవాలతో సందడి
- జలధార వద్ద భక్తుల పుణ్య స్నానాలు

మద్రిపాలెం : నగరంలోని మాధవధారలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం శ్రీ లీలా మాధవస్వామి ఆలయంలో మాఘమాసం సందడి నెలకొంది. ఎంతలా అంటే... ఈ ప్రాంతంలో మాఘమాసం కాస్తా మాధవమాసంగా ప్రాచుర్యం పొందేంతగా భక్తులు మాధవునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తరిస్తున్నారు. జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని ఆలయ ప్రాంగణంలో సహజసిద్ధమైన జలధార ప్రవహిస్తుంది. ఇక్కడ స్నానమాచరిస్తే పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. అతి పవిత్రంగా భావించే ఈ జలధార వద్ద కార్తీకం, మాఘమాసాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఇక్కడ పవిత్ర స్నానమాచరిస్తే కోరికలు తీరుతాయని నమ్మకంగా స్వామి వారిని దర్శించుకుంటారు. ముఖ్యంగా ఏటా మాఘమాసంలో నాలుగు ఆదివారాలు, మాఘ పౌర్ణమి నాడు వేలాది మంది భక్తులు తరలి వస్తారు. స్థానికులతోపాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి భక్తిశ్రద్ధలతో స్వామిని కొలుస్తారు. దేవాలయం చుట్టూ చక్కని మామిడి తోటలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. కార్తీక మాసం తర్వాత అత్యంత ప్రాముఖ్యత కలిగిన మాసం మాఘమాసం అని చెప్పవచ్చు. మాధవునికి ఇష్టమైన మాసం మాఘమాసం ఈ ప్రాంతంలో మాధవమాసంగా ప్రాచుర్యం పొందింది. హిందూ సంప్రదాయం ప్రకారం మాఘమాసంలో నదీ స్నానం ఆచరించి, విష్ణుమూర్తిని పూజించి, శక్తి కొలది దానం చేస్తే కోటి క్రతువులు చేసినంత పుణ్యం కలుగుతుందని నమ్మకం. అందుకే సహజసిద్ధమైన జలధార వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

మాధవుని సన్నిధిలో ప్రత్యేకతలివీ...

మాఘమాసంలో నాలుగు ఆదివారాలు మాధవస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. మూడో వారం ఇక్కడ పరస (తీర్థ మహోత్సవం) నిర్వహిస్తారు. ప్రతీ ఆదివారం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న సమారాధన, ప్రసాద వితరణ నిర్వహిస్తారు. మాఘమాసంలో వచ్చే ఏకాదశి నాడు వేద పండితులతో స్వామి వారికి వార్షిక కళ్యాణోత్సవం జరుపుతారు. అనంతరం తిరువీధి మహోత్సవం నిర్వహిస్తారు. అలాగే మాఘపౌర్ణమి అంటే ఎంతో పుణ్య తిథిగా భావించే భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకుని పవిత్ర జలధారలో స్నానమాచరిస్తారు. ఆ పర్వదినం రోజున కనీసం 2 వేలకు పైగా భక్తులు పాల్గొంటారని అర్చకులు చెబుతున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తరిస్తారు. అదే రోజు సాయంత్రం నాగవెల్లి కార్యక్రమం జరుగుతుంది. ఆ దివ్య క్షేత్రంలోనే కొలువై ఉన్న శివాలయంలో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతాయి. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శివయ్యను పూజిస్తారు. చివరగా అమావాస్యతో మాఘమాసం ముగుస్తుంది. ఆ రోజు కూడా భక్తులు పవిత్ర జలధార వద్ద స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



మాఘమాసంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. భక్తిశ్రద్ధలతో వచ్చి జలధార వద్ద పవిత్ర స్నానమాచరించి మాధవుని కొలుస్తారు. ఆలయంలో భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తాం. భక్తులకు అసౌకర్యం కలగకుండా వంశపారంపర్య అర్చకులు, వారి కుటుంబ సభ్యుల సొంత నిధులు, భక్తుల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నాం. – రవీంద్ర కుమార్, వంశపారంపర్య అర్చకుడు

నిషేధిత పాలిథిన్ కవర్లు స్వాధీనం



అక్కయ్యపాలెంలో దుకాణం వద్ద కవర్లు స్వాధీనం చేసుకుంటున్న నైట్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జీవీకుమార్

సీతంపేట : ప్లాస్టిక్ రహిత నగరంగా మహా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని జీవీఎంసీ అక్కయ్యపాలెం నైట్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వి.కుమార్ కోరారు. అక్కయ్యపాలెంలోని వివిధ వాణిజ్య దుకాణాలు, హోటళ్లు, తోపుడు బళ్ల వ్యాపారాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిషేధిత పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, కప్పులు, బాటిళ్లు వాడొద్దని, వాటికి ప్రత్యామ్నాయంగా క్లాత్, పేపర్, నారతో తయారు చేసిన వస్తువులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేష్, మహేష్, రాజు, శివ, గోవింద్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మురళీనగర్ : జోన్ – 2 డివిజన్ మురళీనగర్ సెక్షన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, నిర్వహణ కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బర్మా కాలనీ, మురళీనగర్, వర్మ కాంప్లెక్స్, తెన్నేటినగర్, బాలభాను పాఠశాల ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ఆదర్శ క్లబ్‌గా తీర్చిదిద్దుతాం



వాకర్స్ క్లబ్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

మురళీనగర్ : సభ్యులందరి సహకారంతో మురళీనగర్ వాకర్స్ క్లబ్‌ను ఆదర్శ క్లబ్‌గా తీర్చిదిద్దుతామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ అన్నారు. క్లబ్ త్రిదశాబ్ది ఉత్సవాలు వాకర్స్ పార్కులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ పరిధిలో ఆదర్శ క్లబ్‌గా కొనసాగుతూ అనేక అవార్డులు సాధించిన క్లబ్‌ను మరింత ఉన్నత స్థానంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వాకర్ వాయిస్ పత్రికను వాకర్ ఏసీహెచ్ఎన్ వెంకటరావు ఆవిష్కరించారు. అనంతరం వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం, క్లబ్ వ్యవస్థాపకుడు ఎన్.బుచ్చయ్య, వాకర్ డిస్ట్రిక్ట్ – 101 గవర్నర్ కె.ద్వారకానాథ్ మాట్లాడారు. నడక పోటీల విజేతలకు పూర్వ జాలీ వాకర్ శకుంతల బహుమతులు అందించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమ్మినేని వెంకటేష్ మొక్కలు పంపిణీ చేశారు. ముందుగా పార్కులోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్సు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, డిస్ట్రిక్ట్ – 101 పూర్వ గవర్నర్ యు.శుభ, క్లబ్ కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాద్, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు జి.వి.లక్ష్మి పాల్గొన్నారు.

వాహనాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు సీతమ్మధార దరి టీపీటీ కాలనీలో మెయిన్ రోడ్డు మీద పార్కింగ్ చేసిన వాహనాలను ఎట్టకేలకు తొలగించారు. 'రోడ్డే పార్కింగ్ స్థలం' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ జోన్ – 3 టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. ఏసీపీ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సదరు ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. రోడ్డుని ఆక్రమించి పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను ద్వారకా స్టేషన్ ట్రాఫిక్ పోలీసుల సాయంతో తొలగించారు. ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆక్రమణలు, వాహనాల పార్కింగ్ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించొద్దు



పోర్టు హాస్పిటల్ వద్ద రిలే దీక్షలో నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ప్రక్రియ వెంటనే నిలిపివేయాలని, సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత 128 రోజులుగా చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. సుమారు 40 వేల మంది పోర్టు, డీఎల్‌బీ, సీఐఎస్ఎఫ్, రిటైర్డ్ కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేట్ వారికి అప్పగించడం దారుణమన్నారు. పోర్టు హాస్పిటల్‌ను పీపీపీ పద్ధతిలో మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా 300 పడకలతో అభివృద్ధి చేసేందుకు ప్రైవేటు వారికి ఇవ్వాలనే నిర్ణయం అనైతికమన్నారు. ఇదే జరిగితే సుమారు 40 వేల మంది ఆరోగ్య భద్రత ప్రైవేటు వారి చేతుల్లోకి నెట్టేసినట్టేనన్నారు. పోర్టులో పీపీపీ, బీవోటీ విధానాలు గతంలో విఫలమయ్యాయని, కాగ్ స్వయానా మొట్టికాయలు వేసిందని, అయినా మళ్లీ పీపీపీకి పోర్టు హాస్పిటల్ అప్పగించడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, అధ్యక్షుడు జె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వరరావు, మూర్తి, సీహెచ్‌వీఎస్ రెడ్డి, నరసింహ, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బాలికల ప్రతిభ



కరాటేలో పతకాలు సాధించిన బాలికలను అభినందిస్తున్న బీజేపీ నేత శ్యామలాదీపిక

సీతమ్మధార : పోర్టు స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ అండర్ – 14 జూనియర్ కరాటే పోటీల్లో ఎస్ఎంసీహెచ్ కళాశాలకు చెందిన ముగ్గురు బాలికలు బంగారు పతకాలు సాధించడం విశేషం. ఈ మేరకు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల ఉత్తర శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో సదరు బాలికలు బి.జ్యోతి, కృష్ణప్రియ, సంగీతలను బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్రిపాలెం ఆర్ అండ్ బీ ప్రాంతానికి చెందిన చెందిన ముగ్గురు సోదరీమణులు కరాటేలో బంగారు పతకాలు సాధించడం అభినందనీయమని కొనియాడారు. మరిన్ని పోటీల్లో పాల్గొని పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కరాటేలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అనంతరం బాలికలకు ఆమె నగదు బహుమతులు అందజేశారు. వీరు ఎస్ఎంసీహెచ్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. బాలికలకు ఎల్లారావు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. పోటీల్లో 8 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినితో ఉపాధ్యాయులు, సిబ్బంది

సీతమ్మధార : స్థానిక పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎన్ఎంసీహెచ్)లో పదో తరగతి చదువుతున్న శృతి బిసాయి బెస్ట్ స్టూడెంట్ అవార్డు సాధించింది. ఈ మేరకు పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ తదితరులు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో గత ఏడాది డిసెంబర్‌లో పదో తరగతి సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ పరీక్షల్లో 600 మార్కులకు 530 సాధించిన శృతి టాపర్‌గా ఎంపికైందన్నారు. అనంతరం శృతికి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రియదర్శిని, బెండి ప్రసాదరావు, కరుణాకర్, హేనా, నీరజ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగాలు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ నారాయణరావు, తదితరులు

మురళీనగర్ : ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ విజయవాడలో నిర్వహించిన సెంట్రల్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు అత్యధిక వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించి రికార్డు సృష్టించారు. ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయంలో టెక్సాస్ ఇన్‌స్టుమెంట్స్ కంపెనీ నిర్వహించిన డ్రైవ్‌లో ఈ కాలేజీ నుంచి ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు చెప్పారు. ఈ కాలేజీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగానికి చెందిన కె.నాగ దుర్గ, జి.సుధీర్ కుమార్, వి.త్రిశాంత్ కుమార్‌ను రూ.9.02 లక్షల వార్షిక జీతంతో కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక చేసింది. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంత పెద్ద మొత్తంలో వార్షిక జీతం లభించడం రికార్డుగా చెప్పుకోవచ్చు. ఈ సెంట్రల్ డ్రైవ్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి 900 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా వారిలో 98 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూలకు షార్ట్‌లిస్ట్ చేశారు. వీరిలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ నుంచి 14 మంది చివరి రౌండ్‌కు చేరుకున్నారు. కఠినమైన ఎంపిక ప్రక్రియ అనంతరం రాష్ట్రం నుంచి 15 మంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందారు. వీరిలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి కేడీవీ నరసింహారావు, స్టూడెంట్స్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ, ఇతర విభాగాల అధిపతులు బుధవారం అభినందించారు.

మురికివాడలో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో వైద్యులు, ఫౌండేషన్ సభ్యులు

కంచరపాలెం : జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధి గాంధీనగర్ మురికివాడలో బుధవారం కారుణ్య క్యాన్సర్స్ ఫౌండేషన్, లీడర్ ఎన్జీవో సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. ఫౌండేషన్ చైర్మన్ జంగం జోషి, కార్యదర్శి కోన ప్రకాష్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ అఖిల, డాక్టర్ సంపత్, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ రమ్య సుమారు 200 మంది రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్, క్యాన్సర్‌కి సంబంధించిన పరీక్షలు చేశారు. 30 సంవత్సరాలు పైబడిన స్త్రీలు తప్పకుండా పెస్మీర్, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని వృంద హాస్పిటల్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంగం విశాఖ జిల్లా ఇన్‌చార్జి ఎ.ఎస్.రావు, అన్నపూర్ణ, కోన శంకర్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్-6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం బేడా సేవ, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠ, యాగశాలార్చన, ధ్వజారోహణం, నిత్య పూర్ణాహుతి, పల్లకి సేవ తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని, గురువారం పుష్పార్చన ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు.

తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం



హెచ్ఎం రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట : భక్తప్రహ్లాద తెలుగు టాకీ చిత్రం విడుదలైన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో మూడు రోజుల ఫిల్మ్ ఫెస్టివల్ బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రారంభమైంది. భక్తప్రహ్లాద చిత్ర దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి చిత్రపటానికి ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సినిమా అభివృద్ధికి దోహదం చేసిన వారిని గుర్తు చేసుకోవడం మన బాధ్యతన్నారు. సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ సినిమా నిర్మించిన దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి సేవలను సినీ పరిశ్రమ గుర్తించి తెలుగు సినిమా దినోత్సవాన్ని పండగలా జరపకపోవడం దురదృష్టకరమన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఏటా ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తోందన్నారు. అనంతరం 1939లో గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వంలో రూపొందిన రైతుబిడ్డ సినిమాను ప్రదర్శించారు. గురువారం సాయంత్రం 5:30 గంటలకు ఒక ఊరి కథ తెలుగు చిత్రాన్ని ప్రదర్శిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు, బాబ్జి పాల్గొన్నారు.

సిగ్నల్ అటు... వాహనాలన్నీ ఇటు...



రోడ్డు మార్జిన్ దాటి వచ్చేసిన వాహనాలు

- సత్యం జంక్షన్ వద్ద వాహనచోదకుల ఇష్టారాజ్యం

సీతమ్మధార : నగరంలోని సత్యం జంక్షన్ సమీపంలోని సిగ్నల్స్ వద్ద విచిత్రమైన సమస్య ఎదురవుతోంది. ఈ జంక్షన్‌లో నాలుగు వైపులా ఫ్రీ లెఫ్ట్ మార్గంలో కూడా వాహనాలు పార్కింగ్ చేయడంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ జంక్షన్ త్రీటౌన్, ఎంవీపీ, ద్వారకా ట్రాఫిక్ స్టేషన్ల పరిధిలో వుంది. కాగా సీతమ్మధార నుంచి సత్యం జంక్షన్ మీదుగా మద్దిలపాలెం వైపు వెళ్లే వాహన చోదకులు ఫ్రీలెఫ్ట్ మార్గంలో బుల్లయ్య కళాశాల వైపు వెళ్లే వాహనచోదకులు అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ఫ్రీ లెఫ్ట్ మార్గంలో దారి లేక గ్రీన్‌సిగ్నల్ పడేవరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గురుద్వారా నుంచి సత్యం జంక్షన్ మీదుగా సీతమ్మధార వైపు వెళ్లే వాహనచోదకులకు కూడా ఇదే సమస్య ఎదురుకావడం గమనార్హం. ఇక్కడ కూడా ఫ్రీ లెఫ్ట్ మార్గంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు అధిక సంఖ్యలో ఆపేయడం గమనార్హం. గ్రీన్ సిగ్నల్ పడగానే త్వరగా వెళ్లిపోవాలన్న ఆత్రుతతో ఫ్రీ లెఫ్ట్ మార్గంలో వాహనాలు నిలిపేస్తున్నారని స్థానిక ప్రజలు, పాదచారులు వాపోతున్నారు. ఈ రకంగా రెండు మార్గాల్లోనూ ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాలు ఆపుతున్నా ద్వారకా ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పట్టించుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ద్వారకా ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించి ఫ్రీలెఫ్ట్ మార్గాలలో వాహనాలు ఆపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇమ్యునైజేషన్ కార్యక్రమంపై డీఎంహెచ్‌వో ఆరా



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : స్వర్ణ భారతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) పరిధిలో ఉండే హరిజన వీధి సచివాలయాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఓపీ, ఐపీ, డయాగ్నొస్టిక్ సేవలు, మందుల లభ్యత, ఎన్‌సీడీ 3.0 సర్వే తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెడికల్ అధికారులు, సిబ్బందికి కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్, రిఫరల్ సేవలపై పూర్తిగా విశదీకరించారు. అభ ఐడీ, మ్యాపింగ్ శతశాతం సాధించాలని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ రవి శంకర్, పలు విభాగాల అధికారులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.